
నందమూరు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగాభవాని


తాళ్లపూడి మండలం బల్లిపాడు శిబిరంలో వైద్య పరీక్షలు


పెరవలిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు


నల్లజర్ల మండలం అవపాడులో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణకు వైద్య పరీక్షలు

ప్రజల ఆయుష్షు పెంచడానికే సురక్ష

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పల్లంట్లలో వైద్య శిబిరం ప్రారంభం
- డివిజన్ వ్యాప్తంగా ఐదుచోట్ల వైద్య సేవలు


దేవరపల్లి మండలం పల్లంట్ల శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రజల ఆయుష్షు పెంచడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పల్లంట్ల గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి గ్రామాల్లోనూ నిర్వహించే ఈ వైద్య శిబిరాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లంట్ల శిబిరాలో 228 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య పరీక్షల వార్డులు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ కన్వీనర్ కూచిపూడి వెంకట సతీష్, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రావు, డాక్టర్ సాంబశివరావు, పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాల ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నందమూరులో 305 మందికి..

కొవ్వూరు: మండలంలోని నందమూరు ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కంటిపూడి గంగాభవాని ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 305 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, గైనకాలజిస్టు ఝాన్సీలక్ష్మి, ఈఎన్‌టీ డి.సునీల్‌రాజు, డాక్టర్ ప్రణీత తదితరులు వైద్య సేవలు అందించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు మారిన రామకృష్ణ , ఎంపీడీ వో కె.సుశీల, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, సచివాలయ కన్వీనర్ మద్దిపాటి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు కంటిపూడి నవ్య తదితరులు శిబిరంలో పాల్గొన్నారు.

బల్లిపాడులో 400 మందికి..

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. హాజరైన రోగులకు మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మైఖేల్ ప్రకాష్ తదితరులు వివిధ రకాల పరీక్షలు చేశారు.ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 400 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడిన స్టాల్ ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో బల్లిపాడు సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కె.హేమంతి, ఆరోగ్య సిబ్బంది మణికంఠ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో 380 మందికి..

పెరవలి: పెరవలిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 380 మంది రోగులకు వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. వారిలో 21 మందిని ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు కృష్ణవేణి తెలిపారు.శిబిరంలో వైద్య నిపుణులు వి.శ్రావణి, మిల్టన్, హేమరాజు, వర్మ రోగులకు సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ రోగులకు మందుల కిట్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు వైఎస్సార్ పార్టీ నాయకులు పంపన అంజి, అగర్తి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవపాడులో 602 మందికి..

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అవపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. గైనకాలజిస్ట్ లిఖిత, ఆప్తమాలజిస్ట్ ఆశిష్‌కుమార్, డాక్టర్ గంగాధరరావు, డాక్టర్ రాజశేఖర్‌లు 602 మంది రోగులకు పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. వారిలో 20 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.

క్లుప్తంగా

11, 17 తేదీల్లో కొవ్వూరులో సురక్ష వైద్య శిబిరాలు

కొవ్వూరు: ఈ నెల 11, 17 తేదీల్లో కొవ్వూరు మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు కమిషనర్ బి. శ్రీకాంత్ సోమవారం తెలిపారు. 11వ తేదీ వైద్య శిబిరాన్ని పట్టణంలోని 3,4,5 వార్డు సచివాలయాల పరిధిలోని వారు, 17వ తేదీ శిబిరాన్ని పట్టణంలోని 6,7,8 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ శిబిరాలు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగుతాయన్నారు. వైద్య నిపుణులతో రోగులకు సేవలు అందించడమే గాకుండా ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందిస్తారని తెలిపారు.

పాఠశాలలకు శానిటరీ సామగ్రి


తాళ్లపూడిలో స్కూళ్లకు శానిటరీ సామగ్రి అందిస్తున్న ఎంఈవో బాలామణి

తాళ్లపూడి: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సోమవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద శానిటరీ సామగ్రి అందజేశారు. 36 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వాటిని అందించినట్టు ఎంఈవో వివరించారు. డస్ట్ బిన్లు, ఫినాయిల్, బాత్ రూం క్లీనర్లు, బ్రష్‌లు వంటి వాటిని ఆరు నెలకు ఒకసారి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధుల నియామకం


షేక్ ఖాదర్ వల్లీ జిల్లా అధికార ప్రతినిధి


గడా జగదీష్, నియోజక వర్గ అధికార ప్రతినిధి

దేవరపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, గోపాలపురం నియోజకవర్గ అధికార ప్రతినిధుల నియామకం జరిగింది. జిల్లా అధికార ప్రతినిధిగా గోపాలపురానికి చెందిన షేక్ ఖాదర్ వల్లీ, పార్టీ గోపాలపురం నియోజకవర్గ అధికార ప్రతినిధిగా చిన్నాయగూడెంకు చెందిన సొసైటీ అధ్యక్షుడు గడా జగదీస్ నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వారి పేర్లను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. ఇరువురు నాయకులు పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. గడా జగదీష్ దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 2019లో చిన్నాయగూడెం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా అధికార ప్రతినిధి షేక్ ఖాదర్ వల్లీ పార్టీ గోపాలపురం మండలశాఖ అధ్యక్షుడిగా పనిచేశారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్జేడీ


కళాశాలలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఆర్జేడీ సీహెచ్ కృష్ణ

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కళాశాల విద్యా, ప్రాంతీయ సంచాలకుడు (ఆర్‌జేడీ) డాక్టర్ సీహెచ్ కృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతులు, కార్యాలయ నిర్వహణను ఆయన పరిశీలించారు. వివిధ ఫైళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కళాశాల నిర్వహణపై ఆర్‌జేడీ సంతృప్తి వ్యక్త పరిచినట్లు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు.

50 మంది విద్యార్థులకు కరాటేలో బెల్ట్‌లు

దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో సోమవారం కేఎస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో దేవరపల్లి నుంచి 50 విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వివిధ రకాల కలర్ బెల్ట్‌లకు వారు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి బెల్ట్ గ్రేడ్ సర్టిఫికెట్లు పొందారు. కార్యక్రమంలో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్, దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్, జె.ప్రసాద్‌ను కేతా శ్రీనివాస్, సీఐ ఎ. శ్రీనివాసరావు అభినందించారు.

డివిజన్ స్థాయి 'స్పందన'కు 11 అర్జీలు


ఆర్డీవో కార్యాలయ స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందనకు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 13 అర్జీలు అందాయని ఆర్డీవో ఎస్.మల్లిబాబు వెల్లడించారు. తన భర్త నుంచి రక్షణ కల్పించాలని, తన కుమారుడికి రావాల్సిన సొమ్ము ఇప్పించాలని మండలంలోని పశివేదలకు చెందిన తాతపూడి సరస్వతి కోరింది. తన దస్తావేజు నకలు, ఈసీ రావడం లేదని చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన మునగాల బాలకృష్ణారావు అనే వ్యక్తి అర్జీ సమర్పించాడు. డ్వాక్రా గ్రూపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని తోగుమ్మికి చెందిన ఆబోతు రాజేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. సంధ్య అనే ఓసీ వర్గానికి చెందిన మహిళ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రాజేష్ కోరారు. తన ఇంటి సమీపంలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండలంలోని మద్దూరుకు చెందిన కైలా వెంకటలక్ష్మి కోరారు. తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మండలంలోని చిడిపికి చెందిన మిద్దే దుర్గాదేవి, మిద్దే రమాదేవి, కలిదిండి సుబ్బలక్ష్మి అర్జీలు అందించారు. కార్మిక శాఖ నూతన జిల్లా ప్రకారం మండలాల లాగిన్ మార్పు చేయించాలని ధర్మవరానికి చెందిన పాలపర్తి చంద్రమోహన్ కోరారు. కొవ్వూరులోని ఆర్ అండ్ బీ బంగ్లాలోని మొక్కలను శుభ్రం చేయించాలని పట్టణానికి చెందిన వాడపల్లి అనంతలక్ష్మి వినతిపత్రం సమర్పించారు. తనకు ప్రాణహానీ ఉందని, తనకు, తన పొలానికి రక్షణ కల్పించాలని తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన తానేటి విజయకృష్ణ కోరారు. వెబ్‌సైట్‌లో తన పేరు నమోదు చేయించాలంటూ పట్టణానికి చెందిన పేపకాయల ఈశ్వరుడు అర్జీ అందించారు. పెళ్లి కానుక పథకం ద్వారా తమకు ఆర్థిక సాయం చేయాలని తాళ్లపూడి మండలం, పెద్దేవానికి చెందిన చదలవాడ రామారావు విజ్ఞప్తి చేశారు. తన ఇంటి పట్టాపై విచారణ జరిపి, న్యాయం చేయాలని నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన గంపల శ్రీనివాస్ అనే వ్యక్తి ఆర్డీవోకు అర్జీ అందించారు. కోరారు. స్పందనలో ఏవో జవహర్ బాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉనకరమిల్లిలో గడప గడపకూ..


వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలోని ఉనకరమిల్లి గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలశెట్టి అయ్యప్ప, నాయకులు పోలిరెడ్డి శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్‌లను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడితే, ప్రస్తుత మన ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తోందన్నారు. ఉనకరమిల్లిలో ప్రధాన సమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు వేంద్ర అబ్బులు, కరిబండి వెంకటరత్నం, సింగంశెట్టి సత్యనారాయణ, జి.మనోహర్, మీసాల సత్తిబాబు, జక్కంశెట్టి పాటేశ్వరరావు, తిరుమలశెట్టి సత్యనారాయణ (చిన్నా), గుళ్ల ఆనంద్, సరిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దృష్టి టిక్కెట్‌పైన.. దీక్షలు విడివిడిగా..

- బాబు అరెస్టుకు వ్యతిరేకంగా వేర్వేరుగా దీక్షలు
- బూరుగుపల్లి సారథ్యంలో ఒకచోట కుందుల నాయకత్వంలో మరోచోట
- నిడదవోలు టీడీపీలో తెలుగు తమ్ముళ్ల గ్రూపులాట


నిడదవోలులోని యర్నగూడెం రోడ్డులో బూరుగుపల్లి శేషారావు వర్గం దీక్షలు


పట్టణంలోని పాత పటిక పరిశ్రమ వద్ద కుందుల సత్యనారాయణ వర్గం దీక్షా శిబిరం

నిడదవోలు: పొరుగున ఉన్న గోపాలపురంలోనే కాదు .. నిడదవోలు నియోజకవర్గంలోనూ తెలుగు తమ్ముళ్లు రోడ్డెక్కి కుమ్ములాడుకుంటున్నారు. మొదటి నుంచీ ఇక్కడ టీడీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒక వర్గానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, రెండో వర్గానికి ఆ పార్టీ నాయకుడు కుందుల సత్యనారాయణ సారథ్యం వహిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టుతో అవి మరింతగా రోడ్డున పడ్డాయి. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా వేర్వేరుగా నిరసన దీక్షలు సాగుతున్నాయి. ఆ దీక్షలు చంద్రబాబుపై మమకారంతో మాత్రం కాదు. రెండు వర్గాల లక్ష్యం ఒక్కటే.. వచ్చే ఎన్నికల్లో నిడదవోలు టీడీపీ టిక్కెట్ సాధించేందుకే. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నేతృత్వంలో పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో దీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆ దఫా టికెట్ నాదే అంటూ ధీమాగా ఉన్న కుందుల సత్యనారాయణ పట్టణంలోని పాత పటిక పరిశ్రమ వద్ద ఏకంగా టీడీపీ రెండో కార్యాలయాన్నే ప్రారంభించారు. అక్కడ ఆయన ఆధ్వర్యంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన దీక్షలు సాగుతున్నాయి.

ప్రజల నుంచి కరవైన స్పందన

అయితే నిడదవోలులో టీడీపీ రెండు వర్గాలుగా దీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ వాటికి ప్రజల నుంచి స్పందన మాత్రం కరవైంది. ప్రజలు ఈ దీక్షలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆమ్యామ్యాలు ఇస్తూ వృద్ధులను సైతం కుందుల సత్యనారాయణ సారథ్యంలోని దీక్షా శిబిరంలో కుర్చోపెడుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మరో ఆరు నెలల్లో ఎన్నికల జరగనున్న వేళ బూరుగుపల్లి, కుందుల ఇంత హడావుడి చేస్తున్నారు కదా? కరోనా సమయంలో వీరిద్దరూ ఏమైం పోయారని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. పనులు లేక ఆకలితో అలమటించిన నిరు పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శిస్తున్నారు. చినబాబు లోకేష్ ఆశీస్సులు ఉన్నాయి. నాదే టికెట్ అంటూ సత్యనారాయణ నియోజవర్గంలోని ఊరూరా తిరుగుతున్నారు. మరోవైపు బూరుగుపల్లి శేషారావు టికెట్ నాదే అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరూ పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా టిక్కెట్ విషయంలో ఇద్దరిలూ భయం లేకపోలేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

46 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు


ఉండ్రాజవరంలో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆయేషాఖాన్

ఉండ్రాజవరం: ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన నిస్సా హాస్పిటల్ స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు అయేషా ఖాన్ 46 మంది గర్భిణులకు అవసరమైన పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆ పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్, ఉషాదేవి, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, మహిళా పర్యవేక్షకురాలు కె.నాగమణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో భారీ అన్నసమారాధన

నిడదవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగిసిన సందర్భంగా స్థానిక గణేష్ చౌక్ సెంటర్లోని పూజాగణపతి, కుమారస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 12 వేల మంది భక్తులు తరలి వచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు దంపతులు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు సరిదే సత్యం, నల్లూరి శ్రీనివాసరావు, లంకంసాని సూర్యారావు, కారింకి నాగేశ్వరరావు, తోలేటి కోటేశ్వరరావు, ముప్పనమోయిన గంగరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులకు పండ్లు, స్వీట్ల పంపిణీ


వృద్ధులకు పండ్లు అందిస్తున్న వీవీ వినాయక్ అభిమానులు

చాగల్లు: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు చాగల్లులో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లయన్స్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచారు. ఆస్పత్రిలోని రోగులకు కూడా పండ్లు అందజేశారు. తొలుత అభిమానులు తీసుకు వచ్చిన బర్త్‌డే కేక్‌ను వీవీ వినాయక్ నివాసంలో ఆయన సోదరుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్ కట్ చేశారు. ఈ సందర్భంగా వినాయక్‌కు ఫోన్‌లో పలువురు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, జి. శ్యామసుందరరావు, పిండి మంగరాజు, దాసరి కృష్ణ, ధూళిపూడి సూరిబాబు పాల్గొన్నారు.

డైట్‌లో 12న జానపద, పాత్రాభినయం పోటీలు

నల్లజర్ల: దూబచర్లలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో ఈనెల 12న జిల్లా స్థాయిలో పాత్రాభినయనం (రోల్ ప్లే)జాపద నృత్యం (ఫోక్ డ్యాన్స్) పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పీవీ రమణమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల 8,9 తరగతుల విద్యార్థులు మాత్రమే పాల్గొనాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడమే గాకుండా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. పాల్గొనే విద్యార్థులు 12వ తేదీ ఉదయం 9 గంటలకు దూబచర్ల డైట్ కళాశాలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు, గైడ్ టీచర్‌కు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. పాత్ర పోషణకు నలుగురు విద్యార్థులు ఉండవచ్చని, ప్రదర్శన సమయం 5-6 నిమిషాలని పేర్కొన్నారు. జానపద నృత్యాల్లో ఆరుగురు విద్యార్థులు పాల్గొవచ్చని ప్రదర్శన సమయం 5-6 నిమిషాలన్నారు. ప్రథమ బహుమతిగా రూ.1800, ద్వితీయ బహుమతిగా రూ.1200, తృతీయ బహుమతిగా రూ.900 అందిస్తామన్నారు. వివ రాలకు గో విందరాజులు-86399 31818, పి. దుర్గా ప్రసాద్ 94942 45797 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్ర

కొవ్వూరు: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భజరంగ్ దళ్ శౌర్య జాగరణ యాత్ర కొవ్వూరులో మంగళవారం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు సంస్కృత పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమై దొమ్మేరు, పెనకనమెట్ట, ధర్మవరం మీదుగా సాగుతుందన్నారు.

కనువిందు చేసిన కాకరపర్రు ప్రదర్శనలు


పూలతో అలంకరించిన వాహనంపై కాకరపర్రు పల్లపు వీధి గణనాథుని ఊరేగింపు


రావణాసురుడు సీతను అపహరించుకుపోతున్న ప్రదర్శన

పెరవలి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా కాకరపర్రులోని పల్లపు వీధి వినాయకుని విగ్రహం ఊరేగింపు సోమవారం శోభాయమానంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల వేషాలు, సెట్టింగ్‌లు కనువిందు చేశాయి. వేషాల ప్రదర్శనకు ట్రాక్టర్లను, ఎడ్లబండ్లను వినియోగించారు. అందుకోసం ఒక్కో వాహనానికి నిర్వాహకులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేశారు. ఆయా వేషాలను తగిన కళాకారులతో వేయించడంతో రక్తి కట్టాయి. ముఖ్యంగా రకరకాల పూలతో నిండిన వినాయక మండపం ఎంతో ఆకట్టుకుంది. ఆగ్రహంతో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి సెట్టింగు చూపరులను ఆకర్షించింది. ఆంజనేయస్వామి వేషానికి ట్రాక్టర్‌ను అడవిలా తయారు చేశారు. అలాగే కుమార స్వామి కోసం పూలతో చేసిన నెమలి వాహనంసెట్టింగ్ ఆకట్టుకున్నాయి. బ్యాండు మేళాలు, భాజా భజంత్రీలు, శక్తివేషాలు, చింపాంజీ, జీబ్రా వంటి వేషాలతో గ్రామం హోరెత్తింది. ప్రదర్శనను చూడడానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. దాంతో కాకరపర్రు వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి.